క్లుప్తంగా

రేపు పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెగా ఓటీఎస్



బి.అనిల్‌కుమార్, చీఫ్ మేనేజర్, పీఎన్‌బీ

పెనమలూరు: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) మెగా వన్‌టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) నిర్వహిస్తుందని విజయవాడ సర్కిల్ చీఫ్ మేనేజర్, రికవరీ డివిజన్ హెడ్ బి.అనిల్ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం కానూరు పీఎన్‌బీ కార్యాలయంలో వివరాలు తెలుపుతూ విజయవాడ సర్కిల్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో రుణాలు తీసుకున్న రుణగ్రహీతలు డిఫాల్ట్ అయిన వారికి ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కానూరు కామయ్యతోపులోని తమ కార్యాలయంలో ఓటీఎస్ నిర్వహిస్తామన్నారు. ఎన్‌పీఏ డిఫాల్ట్ రుణగ్రహీతలు ఓటీఎస్‌లో పాల్గొని అకౌంట్లు సెటిల్ చేసుకోవాలని సూచించారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



నున్న(విజయవాడరూరల్): భస్మ బుధవారం సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 40 రోజుల పాటు జరిగే ఉపవాస ప్రార్థనలు బుధవారం నుంచి ప్రారంభమైనట్టు నున్న సీఎస్ఐ చర్చి పాస్టర్, డీనరీ చైర్మన్ కె.జాన్‌వెస్లీ తెలియజేశారు. ఈ సందర్భంగా విశ్వాసులు విషాద గీతాలను ఆలపించారు. నున్న గ్రామంలో ఆర్‌సీఎం, ఫెయిత్ టెంపుల్, నూతన సంఘం, బెతెస్థ కోనేరు ఇంకా పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అంబాపురం గ్రామంలో సీఎస్ఐ చర్చి, రక్షణ సంఘం, క్రీస్తు సంఘం చర్చి, పి.నైనవరం గ్రామంలో షారోను ప్రార్థన మందిరం, పాతపాడు గ్రామంలో సీఎస్ఐ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో తపస్సుకాలం



ఉంగుటూరు: క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ఉపవాస ధ్యానంలో ఆచరించే తపస్సు కాలం బుధవారం నుంచి ప్రారంభమైంది. పలు గ్రామాల్లో కథోలిక క్రైస్తవులు ఉపవాస దీక్షలు స్వీకరించారు. మత గురువులు విబూధిని వి శ్వాసుల నుదిటిపై సిలువగుర్తువేసి ఆశీర్వచనా లు అందించారు. భస్మ బుధవారం నుంచి గుడ్ ఫ్రైడే వరకు నియమాలతో క్రీస్తును ప్రార్థించాలని మత గురువులు సూచించారు. పెదఅవుటపల్లి, తేలప్రోలు, జోసఫ్‌నగర్, ఉంగుటూరు, మానికొండ తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రేపు గన్నవరానికి పవన్ రాక

స్వర్ణ పంచాయతీ వైబ్‌సైట్ ప్రారంభించనున్న డెప్యూటీ సీఎం



గన్నవరం: స్వర్ణ పంచాయతీ వైబ్‌సైట్‌ను ప్రారంభించేందుకు ఈ నెల 7వ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రానున్నారు. గన్నవరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో సభావేదిక ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. జాతీయ రహదారి నుంచి కళాశాల వరకు బీటీ రోడ్డు నిర్మాణం కూడా చేపట్టారు. కళాశాల ఆవరణతో పాటు బయట ప్రాంగణంలో చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేస్తున్నారు. ఈ సభ నిర్వహణ ఏర్పాట్లను ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

శతాధిక వృద్ధుడు మృతి



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన శతాధిక వృద్ధుడు దన్నె సూరయ్య (102) బుధవారం మృతి చెందారు. 102 ఏళ్ల వయస్సులోనూ నిత్యం వ్యవసాయ పనులు చేస్తూ హుషారుగా ఉండేవాడని, సైకిల్ తొక్కడం రాకపోవటంతో ఎక్కడికైనా కాలి నడకనే వెళ్లే వాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెబుతున్నారు. వ్యవసాయ పనులు చేయటం, నడవటమే సూరయ్య ఆరోగ్య రహస్యమని అన్నారు. ఆయన మృతి పట్ల పలువురు గ్రామ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

వంతెన నిర్మాణం కోసం ఎదురుతెన్నులు



ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదించిన ప్రాంతం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కోసం రైతులతో పాటు జగనన్న కాలనీవాసులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఇక్కడ వంతెన నిర్మాణం కోసం నిధులు కేటాయించినప్పటికీ ఇరిగేషన్ శాఖ నుంచి అభ్యంతరాలు రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం తొమ్మిది నెలలు గడిచినా వంతెన నిర్మాణం ఊసే ఎత్తకపోవడంతో రైతులతో పాటు జగనన్న కాలనీలో గృహాల లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వంతెన నిర్మాణ ప్రతిపాదనను పక్కన పెట్టిన అధికారులు ప్రత్యామ్నాయ రహదారి మార్గాలపై దృష్టి పెట్టారు. ఈ ప్రక్రియలో జరుగుతున్న జాప్యం కారణంగా గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకురావడం లేదు.

మండలంలోనే అతిపెద్ద లేఅవుట్

ఏలూరు కాలువ పక్కనే ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లేఅవుట్ మండలంలోనే అతి పెద్దది. ఇక్కడ అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అసైన్డ్ భూమి పది ఎకరాలతో పాటు మరో 78 ఎకరాలు రైతుల నుంచి కొనుగోలు చేసింది. మొత్తం 88 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఐదు లే అవుట్లలో 3,198 ప్లాట్లను కేసరపల్లి, గన్నవరంతో పాటు మరో ఐదు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కేటాయించారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేసుకునేందుకు వీలుగా విద్యుత్, రహదారులు, తాగునీటి సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. ఈ లేఅవుట్‌కు వెళ్లేందుకు కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు కేటాయించింది. టెండర్ ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభించే సమయానికి భవిష్యత్‌లో జల రవాణా అవసరాల దృష్ట్యా వంతెన ఎత్తుపై ఇరిగేషన్ శాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దీంతో వంతెన నిర్మాణంలో మార్పులు చేసి గత వేసవి కాలంలో పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమైనప్పటికి ఎన్నికల కోడ్ వల్ల నిలిచిపోయింది. దీనివల్ల జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కాలనీవాసులు రహదారి మార్గంగా ఉపయోగిస్తున్న ఏలూరు కాలువ గట్టు కూడా ఇటీవల భారీ వర్షాలకు కోతకు గురై రాకపోకలకు అనుకూలంగా లేదు. దీంతో గృహ సామగ్రి తరలింపు కష్టతరంగా మారిందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటి వరకు కాలనీలో గృహ నిర్మాణాలు



జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలు

చేపట్టేందుకు 950 మంది వరకు దరఖాస్తు చేస్తుకున్నారు. వీరిలో 83 గృహాలు నిర్మాణం పూర్తికాగా, మరో 100 ఇళ్ల వరకు నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇక్కడ వంతెన నిర్మాణం చేస్తే మిగిలిన లబ్ధిదారులు కూడా గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకువచ్చే అవకాశాలు ఉన్నాయి.

రైతుల దశాబ్దాల నాటి కల

అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మించాలనేది పరిసర గ్రామాలకు చెందిన రైతుల దశాబ్దాల కల. గతంలో బల్లకట్టు ద్వారా రైతులు, వ్యవసాయ కూలీలు పంట పొలాలకు రాకపోకలు సాగించేవారు. కాలక్రమేణా బల్లకట్టు తుప్పుపట్టి మూలన పడడంతో పొలాలకు వెళ్లేందుకు సుమారు మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగిరావాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక్కడ వంతెన నిర్మాణం చేయాలని రైతులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వంతెన నిర్మిస్తే రైతులు పండించిన పంటలను కూడా సులభంగా ఇళ్లకు తరలించుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రైతులు, జగనన్న కాలనీ వాసులు కోరుతున్నారు.

> **ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు**
>
> కేసరపల్లి లేఅవుట్‌కు ప్రత్యామ్నాయ రహదారి మార్గంపై సీఆర్‌డీఏ అధికారులు దృష్టి సారించారు. లేఅవుట్ నుంచి గన్నవరం-కంకిపాడు ఆర్అండ్‌బీ రోడ్డుకు అనుసంధానించే విధంగా రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలను సీఆర్‌డీఏ సిద్ధం చేస్తోంది. ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినప్పటికీ ఇంకా ఎటువంటి ఉత్తర్వులు రాలేదు.
>
> –కె.వెంకటశివయ్య, తహసీల్దారు, గన్నవరం

బాబు పర్యటనలో పోలీసుల అత్యుత్సాహం

- గ్రామస్తులను ఇళ్లకు వెళ్లనీయకుండా అడ్డంకులు
- ఆధార్ కార్డు చూపాలని పోలీసుల డిమాండ్



పోరంకిలో రోడ్డుకు అడ్డుగా బైక్ పెట్టి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న కానిస్టేబుల్

పెనమలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పోరంకి పర్యటించిన సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం ప్రకటించి గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులకు గురుచేశారు. సీఎం బుధవారం పోరంకిలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఇంటికి వచ్చారు. అయితే పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. గ్రామంలో ఉన్న అన్ని అంతర్గత రోడ్లు మూసేశారు. చంద్రబాబు పర్యటనతో సంబంధం లేని రోడ్లు కూడా మూసి వేయటంతో గ్రామ ప్రజలకు వారి ఇళ్లకు వెళ్లడానికి చాలా ఇబ్బంది పడ్డారు. పోలీసులు రోడ్లకు అడ్డుగా వారి బైక్‌లు ఉంచారు. తాము తమ ఇళ్లకు వెళ్లటానికి పోలీసులను కోరితే ఆధార్‌కార్డు ఉంటేనే ఇళ్లకు పంపుతామని హడావుడి చేశారు. ''మా ఇళ్లకు మేము వెళుతుంటే ఆధార్‌కార్డు దేనికి'' అని గ్రామస్తులు పోలీసులను ప్రశ్నించారు. భాను ఆస్పత్రి రోడ్డులో ఒక కానిస్టేబుల్ మరీ రెచ్చిపోయి స్కూల్స్, కాలేజీ, ఉద్యోగాలకు వెళ్లే వారిని చాలా ఇబ్బందులకు గురి చేశారు. పోలీసుల వైఖరి పట్ల గ్రామస్తులు మండిపడ్డారు. ఇక బందరు రోడ్డుపై దుకాణాలను పోలీసులు బలవంతంగా మూసివేయించారు.

విజయ కళాశాలలో ఉత్సాహంగా 'సావిష్కర్ 2కె25'



విద్యార్థినులు ప్రదర్శించిన ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ఏపీఎస్ఎస్‌డీసీ జీఎం కిషోర్‌కుమార్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో 'సావిష్కర్-2కె25' కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్నికల్ ఫెస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. తొలిరోజు నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో కళాశాల విద్యార్థినులు తమ మేధో సంపత్తికి పదును పెట్టి పలు నమూనాలను తయారు చేశారు. వీటిలో సోలార్ సిటీ, డ్రోన్ టెక్నాలజీ, హైడ్రోలిక్ రోడ్స్, ఎం.పవరింగ్ ఉమెన్ విత్ స్మార్ట్ 10టీ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎస్ఎస్‌డీసీ జనరల్ మేనేజర్ జి.కిషోర్ కుమార్ పలు ఎగ్జిబిట్లను పరిశీలించి విద్యార్థినులను అభినందించారు. ఐటీ హెచ్‌వోడి వై.విజయ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో తొలిరోజు వైజ్ఞానిక ప్రదర్శన, రెండో రోజు సీఎస్ఈ, ఈసీఈ, ఏఐఎంఎల్, డీఎస్, ఐటీ, ఎంబీఏ, డిప్లొమా విద్యార్థినులు ఆయా అంశాలపై పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, హ్యాకథాన్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరి రోజు విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారని వివరించారు. అనంతరం నిడమానూరు, పెనమలూరు జెడ్పీ పాఠశాలల విద్యార్థులు హాజరై పలు ప్రాజెక్టులను వీక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, సెక్రటరీ శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు, అవేరా కో ఫౌండర్ చాందిని చందన, పలు విభాగాధిపతులు సుబ్బయ్య, విష్ణుప్రియ, మురళి, మధుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

19న పేరంటాలమ్మ ఆలయ హుండీల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 19న ఆలయ ప్రాంగణంలోని హుండీలను లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక బుధవారం తెలిపారు. భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారి పర్యవేక్షణలో లెక్కించనున్నట్లు వివరించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆసక్తిగల వారు పాల్గొనవలసిందిగా కోరారు. ఆలయ సిబ్బంది, సేవా దళ్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

నేడు కంకిపాడు మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలం లోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, సమస్యలపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో ప్రజారోగ్యం

కంకిపాడు: పరిసరాల పరిశుభ్రతతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ఈఓఆర్‌డీ కిరణ్మయి అన్నారు. చెత్త నుంచి సంపద తయారీపై ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిరణ్మయి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను దూరంగా ఉంచాలని, జ్యూట్ బ్యాగులు వినియోగించుకోవాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేరుగా విభజించి చెత్త సేకరణ చేసే కార్మికులకు అందించాలన్నారు. వర్మీకంపోస్టుగా మార్చటంతో చెత్త నుంచి సంపద వృద్ధి చేయటం సాధ్యమవుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజారోగ్యం మెరుగుదలకు పరిశుభ్రత దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఈఓఆర్‌డీ కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణను కాలనీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ సెక్రటరీ కె.నాగప్రసాద్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఖాతాల నుంచి నగదు కట్

- ఆందోళనతో బ్యాంక్‌కు పరుగులు తీసిన ఖాతాదారులు
- ఖాతాదారుల నిరసనతో సమస్య పరిష్కరిస్తామని హామీ

గన్నవరం: స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌కు చెందిన ఖాతాదారుల అకౌంట్‌ల నుంచి వారికి సంబంధం లేకుండా బుధవారం నగదు కట్ అవడం గందరగోళానికి గురిచేసింది. నగదు కట్ అయినట్లు వారి మొబైల్ ఫోన్లకు సందేశాలు రావడంతో వారంతా ఎస్‌బీఐ బ్రాంచ్‌కు పరుగులు తీశారు. వివరాలిలా వున్నాయి. గన్నవరానికి చెందిన ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.7,800 నగదు మైనస్ కావడంతో ఆందోళనకు గురైన ఆయన స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ అధికారులను సంప్రదించారు. అయితే నగదు ఎందుకు కట్ అయిందో తమకు తెలియదని, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు. పెదఅవుటపల్లికి చెందిన మరో మహిళా ఖాతా నుంచి రూ.3,600 కట్ అయినట్లు ఆమెకు మొబైల్ సందేశం వచ్చింది. బ్రాంచ్ అధికారులను అడిగితే ఐదేళ్ల క్రితం పెండింగ్ చార్జీలు ఇప్పుడు కట్ అయినట్లు చెప్పడంతో ఆమె అవాక్కయ్యింది. మరికొంత మంది బ్యాంక్ ఖాతాల నుంచి నగదు ఒక్కసారిగా కట్ అయి మైనస్ బ్యాలెన్స్ చూపించడంతో కంగారుపడ్డారు. దీనిపై బ్యాంక్ అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకపోవడంతో ఖాతాదారులు అయోమయానికి గురయ్యారు. చివరికి బ్యాంక్ అధికారులు నగదు కట్ అయిన ఖాతాదారులందరూ లేఖలు ఇస్తే ఉన్నతాధికారులకు మెయిల్ పెడతామని, సమస్య పరిష్కారానికి రెండు, మూడు రోజుల సమయం పడుతుందని హామీ ఇవ్వడంతో శాంతించారు.

ఉపాధి పనులు పరిశీలించిన పీఆర్ కమిషనర్



పాతపాడు గ్రామంలో ఫామ్‌పాండ్‌ను పరిశీలించిన పీఆర్ కమిషనర్ కృష్ణతేజ

పాతపాడు(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.కృష్ణతేజ పరిశీలించారు. బి.శివారెడ్డి మామిడితోటలో జరుగుతున్న ఫామ్‌పాండ్ పనులను, సరిహద్దు కందకాల పనులను పరిశీలించారు. మస్టర్ రిజిస్టర్‌లో పేర్కొన్న విధంగా వేతన కూలీల సంఖ్య సరిపోవడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మేట్ శారదను కూలీలకు కొలతల ప్రకారం చెల్లింపులు చేస్తున్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫామ్ పాండ్ పై లేయర్ 9/9 అడుగులు, కింది లేయర్ 5/5 అడుగులు, లోతు 2 అడుగులు తవ్వకం పనులకు గాను రోజుకు 300 రూపాయల వేతనం లభిస్తుందని చెప్పడంతో కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పని జరిగే స్థలంలో కూలీలకు ఏర్పాటు చేసిన మెడికల్ కిట్‌ను పరిశీలించారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని కూలీలు ఉదయం త్వరగా వచ్చి పనులు చేసుకోవాలని సూచించారు. కమిషనర్‌తో పాటు ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్, ఎన్టీఆర్ జిల్లా డ్వామా పీడీ ఎ.రాము, ఎంపీడీఓ ఇన్‌చార్జి పి.మురళీకృష్ణప్రసాద్, ఈఓఆర్డీ ఎండీవీ ప్రసాద్, ఈఈ కె.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి.కోటిలింగమ్మ, టీఏ కిరణ్మయి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించిన విద్యార్థులు



పోలవరం ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా బుధవారం పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో ముఖ్యమైన స్పిల్ వే, కాఫర్ డ్యామ్, ఎర్త్ కం రాఫిల్ డ్యామ్ నిర్మాణాలను పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద గోదావరి నది నుంచి ఎత్తిపోస్తున్న 70 మోటర్ల ద్వారా 50 లక్షల క్యూసెక్కుల నీటిని సరఫరా చేయడాన్ని పరిశీలించినట్టు అధ్యాపకులు వసుంధర నాయుడు తెలియజేశారు. 50 మంది విద్యార్థులు, అధ్యాపకులు ఈ టూర్‌లో పాల్గొన్నారు. ఈ టూర్ వలన విద్యార్థులకు సివిల్ వర్క్స్‌పై అవగాహన కల్గుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ అన్నారు. పోలవరం డీఈఈ వెంకటేశ్వరరావు, ఏఈఈ నజీర్ అహ్మద్ ప్రాజెక్ట్ వివరాలను విద్యార్థులకు తెలియజేశారు.

రేపు ఉంగుటూరులో ప్రజావేదిక

ఉంగుటూరు: మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 7వ తేదీన ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీవో వినీల తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి నెల 21 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు 27 గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలపై ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రజా వేదిక నిర్వహిస్తారని తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ మేట్‌లు, కూలీలు హాజరు కావాలని కోరారు.

• నూతన దంపతులకు సీఎం ఆశీర్వాదం



పోరంకిలో నూతన దంపతులతో సీఎం చంద్రబాబునాయుడు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం పోరంకిలో పర్యటించారు. ఇటీవల ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడు బోడె వెంకట్‌రామ్-రితిక వివాహం అయిన నేపథ్యంలో నూతన వధూవరులను సీఎం ఆశీర్వదించారు. కార్యక్రమంలో బోడె ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు.

–పెనమలూరు

నాలుగు నెలలుగా జీతాల్లేవు!

ఉయ్యూరు సీహెచ్‌సీలో శానిటరీ సిబ్బంది ఇక్కట్లు

ఉయ్యూరురూరల్: అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు విలువైన సేవలు అందించాల్సిన శానిటరీ సిబ్బందికి జీతాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు నాలుగు నెలలుగా తమకు వేతనాలు అందడం లేదని శానిటరీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా థర్డ్ పార్టీగా వ్యవహరిస్తున్న ఫస్ట్ ఆబ్జెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో శానిటరీ పారిశుద్ధ్య విభాగంలో కాంట్రాక్ట్ ఏజెన్సీ కార్మికులు సేవలందిస్తున్నారు. అయితే ఏజెన్సీ నిర్వాహకులు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం అధిక వడ్డీలకు అప్పులు చేయవలసిన దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గత రెండేళ్లుగా పీఎఫ్ కట్ చేయడం లేదని, ఈ విషయమై అడిగితే ఏజెన్సీ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.